
# పడిలేచే కడలి తరంగం

మాదిరెడ్డి సులోచన



వర్షం....వర్షం....వర్షం! ఎటు చూచినా వర్షమే. పిల్లలిద్దరూ దగ్గుతున్నారు. ఆయనకు ఒక్క నిమిషం తీరికవుండదు. చేసే వ్యవసాయ మెంతోగాని, పేకాట కబుర్లకు అంతూదరీఉండదు. మేడమీదికి పకోడీలు, వేరుసెనగకాయలు, కాఫీలు పంపటంతో నాకు తీరికలేదు. ఊర్లో ఆస్పత్రి లేదు. దగ్గరగా ఉన్న టౌన్‌కు వెళ్లాలి. ఆయన స్నానానికి వస్తేఅడిగాను.

"రాజా, చిన్నీ ఒకటే దగ్గుతున్నారు.ం

"నన్నేం చేయమంటావ్! మనకే" పరదా లేదుగా. వెళ్ళి డాక్టరుకు చూపించు...." అన్నారు. ఈ వర్షంలో బస్సులో వెళ్ళిరావటం మాటలా! నా దురదృష్టం. ఆస్తి అంతా నాదే అయినా అనుభవించలేని దురదృష్టవంతురాలిని. భర్తతోడి జీవితం ఇంత అందంగా ఉన్నది పిల్లలవి ఇంకెంత అందంగా ఉంటుందో. వారి ఆరోగ్యం నేను పట్టించుకోకపోతే వారేమయిపోతారు.

"శ్యామూ! రాజా ఒళ్ళుకాలిపోతుందే తల్లీ ...." అమ్మమ్మ అరిచింది. భోజనాల తరువాత పిల్లలిద్దరిని తీసుకుని బస్సులో టౌనుకు బయలుదేరాను. ఇద్దరికి ప్లాస్టిక్‌కోట్లు తొడిగి, చిన్న గొడుగు, సంచీ తీసుకున్నాను. ఇంకాస్త గట్టిగా వాదిస్తే దెప్పిపొడుపులు.

"బి.ఏ. వెలగబెట్టావుగా, ఆమాత్రం పనులు చేసుకోలేవూ" అంటారు.

వర్షంమూలంగా డాక్టరుగారి దగ్గర యెక్కువగా రష్‌లేదు. చూచి మందు లిచ్చారు.

"మరేం భయం లేదమ్మా. వర్షాలు పడుతుంటే ఆమాత్రం జలుబు చేయదా! అదీ లేకపోతే మా ప్రాక్టీసు మూలపడుతుంది" అన్నారాయన నవ్వుతూ. బజారుకెళ్ళి పండ్లూ, బిస్కట్లూ కొని బస్ స్టాండుకు వచ్చేసరికి బస్ వెళ్ళిపోయింది. తెల్లవారి ఎనిమిది గంటలకే మరో బస్సుంది. గుఱ్ఱపుబండి అయినా దొరుకుతుందేమోనని చూచాను.

"ఆ రోడ్డుమీద నిలబడితే డిస్ట్రిక్టు బస్సు దొరుకుతుందమ్మా" అరటిపళ్ళు అమ్ముకునే అబ్బాయి సలహా యిచ్చాడు. ఇద్దరిని తీసుకుని రోడ్డుపైకి వచ్చాను. జ్వరం కొద్దిగా తగ్గినా నీరసంగా వుందేమో నడవలేకపోతున్నాడు. చెట్టుకింద రాయి చూచి కూర్చోబెట్టాను. ప్రక్కగా నేలకయ్యగా మారి నీళ్ళుపారుతున్నాయి. బస్సు వచ్చినా ఆపుతాడా? ఊర్లో ఇద్దరు ముగ్గురికి మోటర్‌బైక్స్ ఉన్నాయి. వాళ్ళొచ్చినా నా రాజాని పంపేదాన్ని. నాల్గు చినుకులు వచ్చినా కష్టమే. చీకటిపడింది. అటూ ఇటూ వెళ్ళేవారు తప్ప తెలిసినవారు కనిపించ లేదు. కష్టసుఖాలు పంచుకుందామని ప్రమాణాలు చేసుకున్నాం. కాని సుఖమే పంచుకుంటారు మా శ్రీవారు.

చీకటి, సన్నగా వర్షం ప్రారంభమయింది. రాజాని దగ్గరగాతీసుకున్నాను. నా ఉత్సాహం ఏమయిపోయింది?

"శ్యామతల్లి వచ్చింది. రేడియో అమ్మిపారెయ్యాలి" అనేది పిన్ని.

"ఒకర్తి ఉన్నా పదిమంది పెట్టు. రామ్మాకాసేపు బాట్‌మెంటెన్ ఆడదాం" బాబాయి పిలిచేవాడు.

"శ్యామ మా ఆడబడుచే కాదు, మంచి స్నేహితురాలు" అనేది వదిన.

"శ్యామ్! నువ్వు లేని పార్టీలేదు. సరదాగా ఉండదు" అనేవారు స్నేహ బృందం.

ఒక అల్లరి కాదు. ఒక లెక్కకాదు.

"అమ్మా! చలి...." రాజా అన్నాడు.

నాకే చలిగా ఉంది. పసిపిల్లాడు. వాడికి ఉండదా?

"కాసేపట్లో బస్సురావచ్చురాజా...." అన్నాను. పాల సైకిల్‌వారు కనిపించినా రాజాను పంపివేద్దాం అనుకొని, రోడ్డు పొడవునా దృష్టి సారించాను. ఎవరూ కనిపించలేదు. సన్నగా భయం ప్రారంభ మయింది.

అప్పుడే ఓ ఫియట్ కారు దూసుకు పోయేదల్లా ఆగింది. లైట్‌కాంతిలో నన్ను పరీక్షగా చూచింది ఓ తల. అందంగా, హుందాగా ఉన్న యువకుడు రేన్‌కోటులో దిగాడు.

వర్షం పెద్దదయింది. అతని పాదాలు పట్టుకుని అయినా ఇల్లు చేరాలి అను కున్నాను.

అతను చనువుగా వణుకుతున్న చిన్నిని యెత్తుకుని, ర మ్మ న్న ట్టు చూసాడు.

"అలా చూస్తావేం శ్యామూ! నన్ను గుర్తుపట్టలేదా,"

ఆ గంభీరకంఠం గిరిధర్‌దే. సన్నగా పీలగా ఉండే మనిషి....యెంత మారి పోయాడు!

అతను ముందటి తలుపుతీసి చిన్నిని కూర్చోబెట్టి రాజాను అందుకున్నాడు. నేను ఎక్కాను. రాజాను నా ఒళ్ళో కూర్చోబెట్టి తలుపువేశాడు. తను చుట్టూ తిరిగివచ్చి సీట్లో కూర్చున్నాడు.

"ఇంత ఆలశ్యంగా ఒంటరిగా ఎక్కడికి వెళుతున్నావ్?"

చెప్పాను.

"మైగాడ్! పిల్లలు ఇలా ఉంటే శివరామ్‌కు నిదురెలా పడుతుంది! ఆట యెలా ఆడతాడు!"

తల వంచాను.

"ఆ ద్రాక్షతోటలో మన బంగళా ఉంది. కాఫీతాగి తిరిగి వెడుదువుగాని."

"ఊఁ...." అన్నాను.

"అమ్మమ్మగారు బావున్నారా?"

"ఆఁ...." అన్నాను.

అతను కారు నడుపుతూనే ఆశ్చ ర్యంగా నావంక చూసాడు. పిల్లలకు వెచ్చగా ఉందేమో నిదురపోయారు.

బి.ఏ. పూర్తిచేస్తుండగా మామయ్య పోయాడు. మామయ్యకు నన్నిచ్చి చేసి ఆస్తి పైకిపోకుండా చూడాలని అమ్మమ్మ తాపత్రయం. అగ్రికల్చర్ బి.ఎస్సీ చదివిన మామయ్య అకస్మా త్తుగా తలనొప్పి, జ్వరంతో పోయారు. అమ్మమ్మకు తోడుగా వెళ్ళాను. అప్పు డప్పుడు వచ్చి అమ్మమ్మను ఓదార్చే వాడు గిరిధర్. అతను మామయ్య స్నేహితుడట. అతను బి.ఏ. ఫేలయి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడట. పెద్ద కుటుంబం, ఆస్తిపాస్తులు లేవు. అమ్మమ్మ వ్యవసాయంలో సహాయం చేసేవాడు. అప్పుడు తెగ అల్లరి చేసే దాన్ని. అతన్ని ఆటలు పట్టించేదాన్ని. నేనెంత అల్లరిచేసినా కళ్ళు పెద్దవిచేసు కుని చూచేవాడు. కేరమ్స్,బ్యాట్‌మింటన్ ఒకటేమిటి అన్నీ ఆడేదాన్ని. అతను నాపై ఆశలు పెంచుకున్నాడని అనుకో లేదు.

అమ్మమ్మ కాస్త తేరుకున్నాక తన తోడికోడలి కొడుక్కి నన్నిచ్చి చేయా లని పట్టుపట్టింది. అతను 'లా' చదువు తున్నాడట. ఆస్తిఅంతా నాకే వస్తుందని అమ్మ, నాన్న అంగీకరించారు.

ఆరోజు గిరిధర్ పొలంగట్టున మౌనంగా కూర్చుని గడ్డి పీకి వేస్తున్నాడు.

"గిరీ!...." జవాబు లేదు. దగ్గరగా వెళ్ళి తల అటు, ఇటు ఊపాను. అతను ఉలిక్కిపడి చూచాడు.

"తపస్సుచేస్తున్నావా మహాశయా?"

"ఊఁ...." అన్నాడు.అతనిచూపులు కొత్తగా ఉన్నాయి.

"యెవరికోసమో?"

"శ్యామూ! నీ కోసమే నా తపస్సు! నిన్ను చూచిన క్షణం ఎటువంటిదో కాని నీవు నా స్వంతం కావాలని నా అణు వణువు కోరుకుంటుంది" అన్నాడు.

నేను తెల్లబోయాను. అతనిలా అంటాడని ఊహించనయినా లేదు.

"నాకు తెలుసు శ్యామూ! డబ్బు లేదు, చదువులేదని ఆలోచిస్తున్నావ్ కదూ! నీ చిరునవ్వు చూస్తూ...." అతను నాచేతిని తీసుకుని చెంపకానించు కున్నాడు.

"నన్ను ఆలోచించుకోనియ్యి." అన్నాను చెయ్యిలాగి.

"ఆలోచించు శ్యామూ! నా ఆరాధనను అర్థంచేసుకో," అన్నాడు తనూ లేస్తూ.

నేను అమ్మమ్మతో ఈ విషయం చెప్పాలని ప్రయత్నించాను. కాని చెప్పలేకపోయాను.

శివరామ్ అందగాడే. చదువులో గిరికన్నా అధికుడే. అన్నింటికన్నా అమ్మమ్మకు కావల్సినవాడు. అందుకే మౌనం వహించాను. గిరి అర్థం చేసుకున్నాడేమో, మళ్ళీ కనిపించలేదు. ఊర్లోవారు అనుకోగా విన్నది అతను పెద్ద కంట్రాక్టరయ్యాడని, చెల్లెళ్ళకు మంచి సంబంధాలు చేశాడని, తమ్ముడికి చదువు చెప్పిస్తున్నాడని. శివరామ్ యెప్పుడయినా ఆదరణగా పిలిస్తే గిరిధర్, అతని ఆదరణ గుర్తుకువచ్చేది.

"శ్యామూ!....శ్యామూ...." ఉలిక్కి పడి చూచాను. కారు చిన్న బంగళా ముందు ఆగింది.

పిల్లలను లేపాను. అతను ఆప్యా యంగా వారి వీపులు నిమురుతూ యెత్తు కున్నాడు. నౌకరు కాబోలు పరుగెత్తుకు వచ్చి నా సంచీ అందుకున్నాడు.

అతనలా పిల్లలను యెత్తుకు పోతుంటే నాకళ్ళు చమర్చాయి. ఒక్కనాడయినా శివరామ్ వారినిదగ్గరకు తీయడు. వాళ్ళంతటవాళ్ళు వెడితే కసురు కుంటాడు.

"వీళ్ళ నిలా నాపైకి వదిలి నువ్వేం చేస్తున్నట్టు."

నాకు రోషం వస్తుంది. వాళ్ళను లాక్కువచ్చి రెండు దెబ్బలు వేస్తాను.

"అదేమిటి శివా! పిల్లలు తండ్రి దగ్గర కాకపోతే యెక్కడ గారాలు పోతారు?" అమ్మమ్మ అడుగుతుంది.

"రా శ్యామూ...." వెళ్ళి హాల్లో కూర్చున్నాము. నౌకరుకు చెప్పాడు పిల్లలకు మొదట వడ్డించమని.

"జ్వరం వచ్చింది. పాలు చాలు గిరీ...." అన్నాను.

అతను నవ్వాడు. ఆ నవ్వు ఇప్పటికి నోరు విప్పావు అన్నట్టుంది. "అల్లోపతి మందులకు ఏం కాదు...." అన్నాడు. పిల్లలను తీసుకుని నేను డైనింగ్‌రూమ్ లోకి వెళ్ళాను. అతనూ వచ్చాడు. అతను పిల్లలతో కబుర్లు చెబుతూ నవ్విస్తూ ఆడుతుంటే అదో అపూర్వ దృశ్యంలా నా హృదయంలో నిలిచి పోయింది. ఆ స్థానంలో శివరామ్‌ను ఊహించబోయాను.

"ఇదిగో! బిల్ల దగ్గర నానా గలీజు, వీళ్ళకు ముందే అన్నాలు పెట్టెయ్—" గదుముతాడు.

"కాఫీ తీసుకో శ్యామూ ...." అన్నాడు. అతని చేతిలో కప్పు అందు కున్నాను. పిల్లలు టీవి ముందు కూర్చున్నారు.


"ఇప్పుడు వంట యెందుకు గిరీ? వెళ్ళిపోదాం."

"శివరామ్ యెదురుచూస్తాడా?"

"అమ్మమ్మ అదుర్దా పడుతుందేమో"

"నువ్వు బస్సందుకుని ఇల్లు చేరే సమయానికల్లా నేను ఇల్లు చేరిస్తే చాలుగా" అన్నాడు.

ఇద్దరం బయటి వరండాలో కూర్చున్నాం. సర్కస్ చూపిస్తున్నారు టీ.వి.లో పిల్లలిద్దరూ మైమరచి చూస్తు న్నారు.




"శ్యామూ! గలగల పారే సెలయేరు గుర్తుకు వచ్చేది నిన్ను చూస్తే, యెందుకు అంత మౌనంగా ఉంటున్నావ్?"

"లేదే...." అన్నాను. ఆ ఆప్యా యతకు కరిగిపోతున్నాను. ఒక్కసారి వెళ్ళి అతని హృదయంలో తలదాచు కోవాలని ఉంది. నన్ను నేను నిగ్ర హించుకున్నాను.

"శ్యామూ! ఏమయినా కబుర్లు చెప్పు...." అన్నాడు. నా మానసవీణ మూగబోయింది. కబుర్లు పలకదని యెలా చెప్పనూ? నాకామాత్రం ఆప్యా యతకూడా కరువని చెప్పుకోలేని దుస్థితి. ఒక విధంగా ఒకరిని ఒకరు అర్థంచేసుకోవాలని పెట్టిన కోర్ట్‌షిప్‌లు మంచివేమో అనిపిస్తుంది నాకు. ఆయన త్రాగి వచ్చినప్పుడు చేరువగా వెళ్ళితే డొక్కోవటమే అవుతుంది. ఆయన ఆగ్రహంగా చూస్తారు.

"ఒహో! ఇదేం పతివ్రతావేషం? ఆడవారు కూడా జామ్మని తాగు తుంటే...." అంటారు.

"అదృష్టవంతులు" అంటాను నిర్లిప్తంగా.

"చాలా మారిపోయావు." అన్నాడు గిరి.

"సహజమేగా!" నవ్వాను. అతను నన్నే చూస్తున్నాడు. నా జీవితంలోని అగాధం అంచనా వెయ్యాలని చూస్తున్నాడు.

"నీ పెళ్ళెప్పుడు గిరీ?" మాట మార్చాలని అడిగాను.

"ఇంకా ఆలోచించలేదు శ్యామూ. చేసుకున్నా ఆ అమ్మాయిని సంతోష పెట్టగలనా అని అనుమానం పీడిస్తుంది" అన్నాడు.


"నీ అనుమానం అర్థంలేనిది గిరీ! నీవు మంచి భర్తవు, తండ్రివికాగలవు" అని నాలుక కరుచుకున్నాను.

గిరి అపనమ్మకంగా చూశాడు. అంత నమ్మకం ఉంటే నన్నెందుకు కాదన్నావ్ అన్నట్టున్నాయా చూపులు.

"గిరీ! కౌమార్యదశలో కొందరు తొందరపడి నిర్ణయాలు తీసుకుంటారు. మరికొందరు స్తబ్దంగా ఉండిపోతారు. నేను ఆలోచించే లోపలే అంతా నిర్ణయం అయ్యింది...." అన్నాను. అంటుండే నా కంఠం వణికింది.

అతను ఉద్వేగంగా నా చేయిపై తనచేయి వేశాడు.

"గిరీ! ఆరోజు ఒక్కటే ఆలో చించాను. నిన్ను ఒక పనిమనిషిగా చూచే అమ్మమ్మ ఆదరించకపోతే, ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌లో బాధపడతా



వనే అనుకున్నాను గాని, నీ ఆరాధన గ్రహించలేదు గిరీ...." అన్నాను. నా కళ్ళు నిండుకున్నాయి.

"శ్యామూ!...."

"గిరీ! జీవితం చిత్రమయింది. అందనివి అందుకోవటానికి వెనుకాడతాము. అందనివాటికి అర్రులు చాచి ఆశాభంగం పొందుతాము." అన్నాను కన్నీరు ఒత్తుకుని. అతని ముఖం కమిలిపోయింది.

"భోజనం సిద్ధమయింది...."పనివాడు చెప్పాడు.

ఇద్దరం లేచాము. భోజనానికి కూర్చున్నాము. అమ్మమ్మగారింట్లో వేసుకున్నట్టే ఒకరికంచంలో ఒకరం ఒడ్డించుకున్నాం. ఆరోజు భోజనం తృప్తిగా అనిపించింది చాలా రోజులతరువాత. అతను ఫ్రిజ్‌లో నుండి టిన్డ్ ఫ్రూట్స్ తీసి పిల్లలకు, నాకు పెట్టాడు. శివరామ్, నేను కలిసి కూర్చుని భోజనం చేసిన రోజులు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అతనికి లేని వ్యసనం లేదు. నిర్వికారంగా అన్నింటిని భరించటం నేర్చుకున్నాను. ఒంటరితనం దిగులులో ఆశాకిరణాల్లా పిల్లలు తప్ప ఏముంది!

ఒకరికోసం ఒకరు పనిచేయటంలో యెంత ఆనందం ఉంది?

మనిషికి స్నేహపూరితమైన మాటలు యెంత బలాన్ని కలుగజేస్తాయి. గిరిధర్ సమక్షంలో యెంతో హాయిగా ఉంది. కొందరు దైహిక వాంఛలతో తృప్తిని వెతుక్కుంటారేమో కాని, నాకు మానసికంగా దగ్గరగా వచ్చే తోడు కావాలి.

"ఇంకొంచెం పండ్లు వేస్తాను శ్యామూ."

"వద్దు గిరీ," చెయ్యి అడ్డంపెట్టినా వినలేదు. మళ్ళీ చిన్నప్పటి శ్యామలనై గలగల మాట్లాడుతుంటే గిరి సంతోషంగా చూచాడు.

"అంకుల్! టీవి ఇప్పుడే రాదా?" రాజా దిగులుగా అడిగాడు.

"రేపు వస్తుంది రాజా." రాజాని వడిలో కూర్చోబెట్టుకున్నాడు. చిన్ని వచ్చింది. దాని కళ్ళు వాలిపోతున్నాయి.

"శ్యామూ! చిన్నపిల్లల ప్రోగ్రాం వున్ననాడు వీళ్ళను పంపు, కారు పంపుతాను." అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. మేం టీవి ఫ్రిజ్‌లాంటివి కొనలేకకాదు. యెంత డబ్బయినా ఆయన వ్యసనాలకు సరిపడదు.

"శివరామ్‌కు కోపం వస్తుందా?"

"ఆయనకంత తీరిక, ఓపిక ఎక్కడివి గిరీ?"

"యెప్పుడయినా గెలుస్తారా?"

"సంవత్సరానికి ఒక్కసారి, రెండుసార్లు గెలుస్తారేమో, గెలిచిన రోజు తాగరు!" అన్నాను. ఆ రెండురోజులే మేం భార్యభర్తలం అని గుర్తుచేసే రోజులు.

"ఈ వ్యసనాలు మాన్పించాలని ఏవయినా ప్రయత్నించావా?"

ప్రయత్నించడం భంగపడటం అన్నీ అయ్యాయి. ఇక ఒకే దారి ఉంది విడాకులివ్వటం," అన్నాను నిర్లిప్తంగా.

బాధగా చూచాడు గిరి.

"కాని గిరీ.... నేను అతన్ని ప్రేమించాను...." అన్నాను. నా గొంతుకు ఏదో అడ్డంపడ్డట్టు అయింది.

"అమ్మా....నిద్రొస్తుందే...." రాజా ఆవులించాడు.

పిల్లలను తీసుకుని లేచాను. గిరిధర్ రాజా చేయిపట్టుకుని బయటికి వచ్చాడు. కార్లో కూర్చున్నాను. సన్నగా వర్షం పడుతోంది.

కారు కదిలింది.

"నా కీరోజు చాలా తృప్తిగా ఉంది గిరీ" అన్నాను.

అతనేం మాట్లాడలేదు.

"గిరీ! నా మనసు బాగోలేనప్పుడల్లావచ్చి కాసేపు ప్రశాంతమైన ఈ వాతావరణంలో గడుపుతాను, అభ్యంతరమా!"

"నా అదృష్టంగా భావిస్తాను. శని,

ఆదివారాలు తప్పక ఉంటాను" అన్నాడు.

"ఇక్కడికి రావాలంటే ఓ చిన్న షరతు...."

"చెప్పు శ్యామూ!" కారు సాగిపోతుంది.

"నీకింకా నేనంటే అభిమానం, ఆరాధన ఉన్నాయా గిరీ?"

"అదేంమాట శ్యామూ!"

"నేను అడిగింది ఏదయినా ఇస్తావా?"

"అడిగిచూడు," అన్నాడు ముందుకు చూస్తూ.

"నువ్వు త్వరగా వివాహం చేసుకోవాలి" అన్నాను.

అతను నావంక చూచి బాధగా ముఖం పెట్టాడు.

"గిరీ! ప్రేమ నిర్వచించరానిది. ప్రేమకు కామానికి, దైహిక సుఖాలకు ముడిపెట్టుకోకూడదు," అన్నాను.

అతను ఈసారి మౌనం వహించాడు.

"వీటి అన్నిటికి అతీతమయింది నీ ప్రేమ. అది పదిలంగా దాచుకుంటాను. నువ్వు నమ్మవు గిరీ! ఈ రోజు రెండు గంటల్లో నేను పొందిన అనుభూతి, తృప్తి వర్ణించలేనివి. నీ చల్లని స్నేహంలో సేద తీరాలంటే నువు ఓ ఇంటివాడివి కావాలి." ఆప్యాయంగా అతని భుజం తట్టాను.

అతను ఈసారి మాట్లాడలేదు. కారు వెళ్ళి మా ఇంటిముందు ఆగింది. నేనూహించినట్టే అమ్మమ్మ ఆదుర్దాగా చూస్తోంది. నన్ను చూస్తూనే ఆమె ముఖం చాటంత అయింది.

"వచ్చావా తల్లీ! పదిసార్లు పైకివెళ్ళి చెప్పాను. వీడి తలపండు పగలా...." అంటూ రాజాను అందుకుంది. చిన్నని భుజానవేసుకుని దిగాను.

"యెవరు? .... నువ్వా గిరీ? బావున్నావా? అమ్మమ్మ ఆశ్చర్యంగా చూసింది.




"బావున్నాను అమ్మమ్మా....వస్తాను శ్యామూ."

"అదేమిటి నాయనా, ఇంట్లోకి రా...." అమ్మమ్మ పిలిచింది.

"ఇప్పుడు దగ్గరలోనే పని. వస్తుంటాను...."

అమ్మమ్మ లోపలికి వెళ్ళింది.

"గిరీ...."

"శ్యామూ! చెప్పానుగా నువ్వేది కోరినా కాదనే శక్తి లేదని. నువ్వే చూడు నచ్చిన అమ్మాయిని...."అన్నాడు, చేతులు ప్యాంటు జేబులో పెట్టుకుని.

నా కళ్ళముందు ఆఖరు చెల్లెలు అనిత మెదిలింది.

"మళ్ళీ మనసు మార్చుకోవుగా...."

"ఊహుఁ!...." అతను వెళ్ళి కార్లో కూర్చున్నాడు.

"ఆసు పడిందిరా.... ఆసు...."మేడ మీదనుండి పెద్దగా కేకలు వినిపించాయి.

"పిల్లల్ని పంపు...." గిరికారు దూరమైంది. అలాగే నిలబడ్డాను. ఈ నిరాశామయమయిన జీవితంలో ఒక్క ఆశాకిరణం గిరి స్నేహం. మెల్లగా ఇంట్లోకి వచ్చి చిన్నని పడుకోబెట్టాను.

"ఓ వందరూపాయలు కావాలి. అలాగే రెండుకప్పుల కాఫీ పంపించు. ఓ ఇద్దరు కొత్తవాళ్ళు వచ్చారు. వాళ్ళకు బీర్ పడదట...." అనేసి నిలబడిపోయాడు శివరామ్.

నా హృదయం భగ్గుమంది. పిల్లలెలా ఉందని అడగనివాడు, ఈ వర్షంలో యెలా వచ్చారని అడగనివాడు డబ్బు అడుగుతున్నాడు.

"నాకు చేతకాదు. హోటల్‌నుండి తెప్పించుకోండి. పంటమ్మిన డబ్బంతా మీ దగ్గరే ఉంది. నా దగ్గర లేదు." అన్నాను నిర్లక్ష్యంగా.

"ఊఁ...." కోపంగా చూచి వెళ్ళిపోయాడు.

మెల్లగా కిటికీ దగ్గరకు నడిచాను. మా పశువులుకాచే కుర్రాడు ఏదో పాట పాడుకుంటున్నాడు. నా హృదయానికి ఒక్క చరణం బాగా హత్తుకుపోయింది. 'పడిలేచే కడలి తరంగం'ఆ తరువాత అన్నవి వినిపించలేదు. నా హృదయమూ అలాగే ఉంది.

"అన్నం తినమ్మా....ఆఁ...." ఆపులిస్తూ వచ్చింది అమ్మమ్మ.

"నా భోజనం అయింది." అన్నాను, కనుకొలుకులలో నిలిచిన నీరు తుడుచుకుని. అలాగే చీకట్లోకి చూస్తూ నిలబడిపోయాను.

.... .... ....